# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 30, జూన్ 2026


వరల్డ్ కప్‌కు ఎంపికైన

## వైస్‌కెప్టెన్ స్నేహకు ఘన సన్మానం

**దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించిన ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ నాయకులు**

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 29, ప్రభాతవార్త :**



భారత జట్టు తరఫున ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ సౌత్ ఇండియన్ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో వైస్ కెప్టెన్‌గా రాణించి, రాబోయే వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైన స్నేహ స్నేహను ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. శివకుమార్ మాట్లాడుతూ క్రీడా రంగంలో స్నేహ సాధిస్తున్న విజయాలు జిల్లాకే గర్వకారణమని అన్నారు. అంతర్జాతీయ మిగతా 2లో..

ఒక్కరికి ఒక్క ఓటే... ఓటరు జాబితాలో

## అక్రమాలకు తావులేదు

**✪ మంత్రి వివేక్ ✪ ప్రతి ఇంటికీ వెళ్లండి... ప్రతి ఓటర్‌ను నమోదు చేయండి.. బీఎల్‌ఏలకు మంత్రి దిశానిర్దేశం**



**మందమర్రి, జూన్ 29, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని బి1 క్యాంపు కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ఏర్పాటు చేసిన బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్‌ఏలు) సమీక్ష సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణను పకడ్బందీగా నిర్వహించేందుకు బీఎల్‌ఏలకు పలు కీలక సూచనలు చేశారు. ప్రతి బీఎల్‌ఏ తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల పూర్తి వివరాలను మిగతా 2లో..



వర్షాల కోసం శివలింగానికి

## జలదిగ్భంధనం

**కదిలి పాపహరేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు**

**దిలావర్‌పూర్, జూన్ 29, ప్రభాతవార:**

దిలావర్‌పూర్ మండలంలోని ప్రసిద్ధ శ్రీ మాతా అన్నపూర్ణ సమేత కదిలి పాపహరేశ్వర ఆలయంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతులకు మంచి పంటలు పండాలని కోరుతూ సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ భక్తులు ఆలయ శివలింగానికి జలదిగ్బంధనం చేశారు. ఈ ఆచారంలో భాగంగా శివలింగం చుట్టూ పూర్తిగా నీటిని నింపి మరుసటి రోజు ఉదయం వరకు అలాగే ఉంచుతారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో బెల్లంతో పాయసం తయారు చేసి శివలింగానికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఆ తర్వాత మిగతా 2లో..

## ఎస్ఐఆర్ ఫాంల పంపిణీ గడువులోగా పూర్తి చేయాలి



**✻ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి**




**నిర్మల్, జూన్ 29, ప్రభాతవార్త:**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఎస్ఐఆర్ ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఫాంల పంపిణీ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫాంలు అందివ్వాలని స్పష్టం చేశారు. ఫాంల పంపిణీ అధికారం కేవలం బిఎల్ఓలకు మాత్రమే ఉందని, ఇతర వ్యక్తులకు లేదని తెలిపారు. బిఎల్ఓలు విధిగా ఐడీ కార్డులు ధరించాలన్నారు. ప్రజల సందేహాల నివృత్తికి ప్రతి చోట హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని, ఎన్యుమరేషన్ యాప్ వినియోగించే అధికారం బిఎల్ఓలకు మాత్రమే ఉందని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని, ఓటర్ల నుంచి పూర్తి చేసిన మిగతా 2లో..

## ప్రజలు నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలి: ఎస్పీ

**ఆసిఫాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :**



ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ పేర్కొన్నారు. కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుండి మొత్తం 12 ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.




### వరల్డ్ కప్‌కు ఎంపికైన

# వైస్‌కెప్టెన్ స్నేహకు ఘన సన్మానం

(మొదటిపేజీ తరువాయి)

స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ వరల్డ్ కప్ పోటీల్లోనూ వైస్ కెప్టెన్‌గా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. ఆమె భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు. సన్మాన కార్యక్రమంలో స్నేహ మౌల్‌కర్ ను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి అభినందించారు. క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది యువత క్రీడల వైపు ఆకర్షితులవుతారని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీయూష్ ఘోష్, ప్రధాన కార్యదర్శి సునీల్ మండల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వినాయక్, సుశాంత్ బర్మన్, జాయింట్ సెక్రటరీ రమాకాంత్ యాదవ్, విజయ్ కుమార్, ఉత్తమ్, పురుషోత్తం, బిద్యుత్ ఘోష్తో పాటు అసోసియేషన్ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొని స్నేహకు అభినందించారు.

### ఒక్కరికి ఒక్క ఓటే... ఓటరు జాబితాలో

# అక్రమాలకు తావులేదు

(మొదటిపేజీ తరువాయి)

సేకరించాలని మంత్రి సూచించారు. 2002 సంవత్సరానికి ముందు నమోదైన ఓటర్ల వివరాలను సంబంధిత ఓటర్లకు చేరవేసే బాధ్యతను కూడా తీసుకోవాలని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అర్హులైన యువతను గుర్తించి కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల వివరాలను సేకరించి సంబంధిత సమాచారం నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే, రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్న వారిని గుర్తించి, నిబంధనల ప్రకారం ఒకే చోట మాత్రమే ఓటు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేందుకు బీఎల్‌ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్ ఫాంల పంపిణీ గడువులోగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఫాంలను తప్పనిసరిగా తిరిగి సేకరించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. ఫాంల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలన్నారు. అన్ని నిబంధనలు పాటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించాలని, ఎలాంట నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ దేవీదాస్ తదితరులు పాల్గొన్నారు.

### వర్షాల కోసం శివలింగానికి

# జలదిగ్బంధనం

(మొదటిపేజీ తరువాయి)

ఆ పాయసాన్ని చిన్నారులకు తినిపించే సంప్రదాయాన్ని అర్ధపాయాసం అని పిలుస్తారు. ఈ పూజను ప్రతి ఏడాది నిర్వహిస్తే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని స్థానికుల గట్టి విశ్వాసం. అదే ఆనవాయితీని ఈ ఏడాది కూడా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, లోక కల్యాణం కోసం ఈ ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ పరిసర గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

# మంచిర్యాలలో సేవా కార్యక్రమాలకు లయన్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గాల సంకల్పం

**- నాలుగు క్లబ్బులకు మండల బాధ్యతలు స్వీకరించిన దొంతుల ముఖేష్**

**- పేదల సేవే లక్ష్యమని ప్రకటన**

**మంచిర్యాల, జూన్ 29 ప్రభాతవార్త**




సమాజ సేవను మరింత విస్తరించే లక్ష్యంతో లయన్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గాలు బాధ్యతలు స్వీకరించాయి. లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సంస్థ జిల్లా 320జీ జిల్లా గవర్నర్ లయన్ మొర బద్రేశం, లయన్ దొంతుల ముఖేష్‌పై విశ్వాసం ఉంచి ఆయనకు రీజియన్ 7 పరిధిలో జోన్ 2 చైర్మన్ బాధ్యతలను అప్పగించారు. ఈ క్రమంలో మంచిర్యాలకు చెందిన నాలుగు క్లబ్బులను ఆయనకు కేటాయించారు. మంచిర్యాల, గర్మిల్ల, గోదావరి, రూట్ లక్ష్మీనగర్ లయన్స్ క్లబ్బుల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ జిల్లా గవర్నర్లు చిదుర సురేష్, ఎన్.వి. రావు, ద్వితీయ ఉప జిల్లా గవర్నర్ ఊదరి చంద్రమోహన్, జిల్లా సమన్వయకర్త సిరిపురం శ్రీనివాస్, రీజియన్ చైర్మన్ గుర్రాల చక్రధర్, రీజియన్ సమన్వయకర్త డాక్టర్ సుగుణాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. 2026, 27 సంవత్సరానికి మంచిర్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా పి. వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా తవుటం శ్రీనివాస్, కోశాధికారిగా ఏ.వి. రావు బాధ్యతలు స్వీకరించారు. గర్మిల్ల క్లబ్‌కు నేరెళ్ల శ్రీనివాస్ అధ్యక్షులుగా, కాసం మల్లికార్జున్ కార్యదర్శిగా, చిట్టా గిరిబాబు కోశాధికారిగా బాధ్యతలు చేపట్టారు. రూట్ లక్ష్మీనగర్ క్లబ్‌కు కాసు శ్రీనివాసరాజు అధ్యక్షులుగా, కన్నూరు వంశీ కార్యదర్శిగా, కట్ల కిరణ్ కుమార్ కోశాధికారిగా నియమితులయ్యారు. గోదావరి క్లబ్‌కు మట్టపల్లి సంపత్ రావు అధ్యక్షులుగా, చిలువేరు శ్రీనివాస్ కార్యదర్శిగా, రావి సునీల్ కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జోన్ చైర్మన్ దొంతుల ముఖేష్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి జిల్లా గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంవత్సరం తమ పరిధిలోని నాలుగు క్లబ్బుల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాలు, ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీ, మధుమేహ నిర్ధారణ శిబిరాలు, రక్తదాన శిబిరాలు, విస్తృతంగా మొక్కల నాటకం, పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ, గర్భిణులకు పౌష్టికాహార కిట్లు, నిత్యావసర సరుకుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, కార్యవర్గ సభ్యుల సహకారంతో జిల్లాలోనే జోన్2ను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఆర్‌టీఏ కార్యాలయం వద్ద బార్ కోడ్ రేడియం దోపిడి

**ఆసిఫాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :**



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయం వద్ద వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ప్రక్రియలో కొత్తగా ప్రవేశపెట్టిన రేడియం బార్ కోడ్ విధానం పేరిట ప్రైవేట్ కాంట్రాక్టర్ వాహనదారులను తీవ్రంగా నిలువుదోపిడీ చేస్తున్నారని అతనిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని లారీ, బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం ఆర్‌టీఏ కార్యాలయంలో జిల్లా రవాణా అధికారి వెంకటరెడ్డికి అసోసియేషన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీదర్ల శంకర్, కార్యదర్శి నిజాం మొయినుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శహబాజ్ మాట్లాడుతూ గతంలో వాహనాల ఫిట్‌నెస్ కోసం రేడియం స్టిక్కర్లకు కేవలం రూ. 500 నుండి రూ. 600 వరకు మాత్రమే ఖర్చు అయ్యేదని తెలిపారు. అయితే ఈ నెల నుండి రంగ ప్రవేశం చేసిన ఒక కొత్త ప్రైవేట్ కాంట్రాక్టర్, ఫిట్‌నెస్ కోసం వచ్చే ప్రతి వాహనానికి రేడియం బార్ కోడ్ పేరిట ఏకంగా రూ. 5000 నుండి రూ. 7000 వరకు అడ్డగోలుగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విపరీతమైన దోపిడీ వల్ల జిల్లాలోని రవాణా రంగ యజమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధిక వసూళ్లకు పాల్పడుతున్న సదరు ప్రైవేట్ కాంట్రాక్టర్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వాహనదారులకు పెనుభారంగా మారిన ఈ కొత్త క్యూఆర్ కోడ్ రేడియం విధానాన్ని తక్షణమే రద్దు చేసి గతంలో ఉన్న పాత రేడియం విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని వారు డీటీఓను కోరారు.

# ఎంఆర్పీ ధరలకే ఎరువుల విక్రయం చేయాలి

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 29, ప్రభాతవార్త :**




ఆసిఫాబాద్ మండలంలోని జన్కాపూర్ రైతు వేదికలో సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్ ఎరువుల డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఎరువుల డీలర్లు ఎంఆర్పీ ధర కంటే అధిక ధరలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎరువులను విక్రయించరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే రైతులకు నాణ్యమైన ఎరువులను విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి డీలర్ తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఎంఆర్పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయించడం, అక్రమ నిల్వలు చేయడం, ఇతర ఉల్లంఘనలకు పాల్పడిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి హెచ్చరించారు. ఈ సమావేశంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మిలింద్ కుమార్, మండలంలోని ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూన్ 29, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్‌లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కోటపల్లి మండలం రొయ్యలపల్లి గ్రామానికి చెందిన రామటెంకి రాజమల్లు తన తండ్రి నుంచి ఆధీనంలో ఉన్న ఇల్లు, పెరడును కొంతమంది అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్ ప్రాంత వాసులు గుడిపేటలోని కేంద్రీయ విద్యాలయంకు వెళ్లే ఆర్.టి.సి. బస్సు సేవలను రామకృష్ణాపూర్ వరకు పొడిగింపు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండల కేంద్రానికి చెందిన గొర్రె శ్రీనివాస్ తనకు లొంగిపోయిన మావోయిస్టుల కోటాలో కేటాయించిన స్థలం కబ్జాకు గురైనందున తగు చర్యలు తీసుకొని భూమిని తిరిగి ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కోటపల్లి మండలం పంగిడిసోమారం గ్రామానికి చెందిన బోయిని లచ్చయ్య తన భూమిని అక్రమంగా పట్టా చేయించుకుని బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై



చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామానికి చెందిన కాడం బీరయ్య తమ గ్రామంలోని కురుమ గూడెంలో మురుగు కాలువలు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన ఉప్పరి ఆశ్రిత తనకు సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌లోని వల్లభాయినగర్‌కు చెందిన వెల్దండి మల్లేశ్వరి తన భర్త మరణించినందున ఆయన పేరిట ఉన్న పింఛన్ తన పేరిట మార్చి ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 48 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే విధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోదాములు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.16 కోట్ల 50 లక్షల నిధులు

### - ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**భైంసా, జూన్ 29, ప్రభాతవార్త:**

ముధోల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో 40 కొత్త గోదాముల నిర్మాణానికి, అలాగే సీసీ రోడ్ల పనుల కోసం రూ.16 కోట్ల 50 లక్షల నిధులు మంజూరైనట్లు స్థానిక శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ తెలిపారు. సోమవారం భైంసా పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వివరాలను వెల్లడించారు. గడిచిన వారం రోజుల క్రితమే నియోజకవర్గంలో 35 గోదాములు, సీసీ రోడ్ల నిర్మాణ పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.27 కోట్లు కేటాయించిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి గ్రామంలో గోదాముల నిర్మాణం చేపట్టడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా నిధులను విడుదల చేసిందని, వీలైనంత త్వరలోనే క్షేత్రస్థాయిలో పనులను ప్రారంభిస్తామని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ 2.5 సంవత్సరాల కాలంలో నియోజకవర్గ పరిధిలోని గ్రామాలలో పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం మహిళా సమైక్య భవనాల నిర్మాణం, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ గోడలు, గోదాములు, కమ్యూనిటీ క్యాటిల్ షెడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని వివరించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే తన ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పునరుద్ఘాటించారు.



## నిర్మల్‌కు కేంద్రం వరం..

## అదనంగా రూ.8.60 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**నిర్మల్, జూన్ 29, ప్రభాతవార్త:**



గత వారం మంజూరైన రూ.28.15 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులకు అదనంగా నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం మరో రూ.8.60 కోట్ల నిధులు మంజూరైనట్లు భారతీయ జనతా పార్టీ శాసనసభ పక్ష నేత, నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కేంద్ర నిధులతోనే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన సాధ్యమవుతోందని పేర్కొన్నారు. మంజూరైన రూ.8.60 కోట్ల నిధుల్లో రూ.7.80 కోట్లతో 26 గ్రామాల్లో వ్యవసాయ గోదాములు, రూ.60 లక్షలతో మూడు గ్రామ పంచాయతీ భవనాలు, రూ.20 లక్షలతో రెండు మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇందులో ఒక్కో గోదాము నిర్మాణానికి రూ.30 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు చెప్పారు. వ్యవసాయ గోదాములు మంజూరైన గ్రామాల్లో సారంగాపూర్ మండలంలోని బిరవెల్లి, బోరిగాం, మలక్ చించోలీ, స్వర్ణ, యాకర్ పెల్లి, రాంసింగ్ తండా ఉన్నాయి. లక్ష్మణ్‌చందా మండలంలోని న్యూ కంజర్, మునిపెల్లి, నర్సాపూర్ (డబ్ల్యూ), చింతల్ చందా, వడ్యాల్ గ్రామాలు ఎంపికయ్యాయి. సోన్ మండలంలోని ఓల్డ్ పోచంపాడ్, సిద్దిలకుంట గ్రామాలకు, నిర్మల్ రూరల్ మండలంలోని న్యూ పోచంపాడ్, లంగడా పూర్, కౌట్ల (కే), నీలాయిపేట్, తల్వేద గ్రామాలకు గోదాములు మంజూరయ్యాయి. నర్సాపూర్ (జీ) మండల కేంద్రంతో పాటు మామడ మండలంలోని పొన్కల్, న్యూ సాంగ్వి, బండల ఖానాపూర్ గ్రామాలలో వీటిని నిర్మిస్తారు. అలాగే దిలావర్ పూర్ మండలంలోని బన్సపెల్లి, న్యూ కంజర్, మాయాపూర్, మాడేగాం గ్రామాలకు కూడా నిధులు కేటాయించారు. గ్రామ పంచాయతీ భవనాల విషయానికి వస్తే నిర్మల్ రూరల్ మండలం ముక్తాపూర్, లక్ష్మణ్‌చందా మండలంలోని న్యూ కంజర్, వడ్యాల్ తండా గ్రామ పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున నూతన భవనాలు మంజూరయ్యాయి. ఇక మహిళా సమాఖ్య భవనాల కింద లక్ష్మణ్‌చందా మండలం న్యూ కంజర్ గ్రామంలో రూ.10 లక్షలతో స్వయం సహాయక సంఘాల భవన నిర్మాణానికి, మరో రూ.10 లక్షలతో వర్క్ షెడ్ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన ఈ నిధులతో రైతులకు ధాన్యపు నిల్వల ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని, గ్రామాల్లో పాలన మరింత పకడ్బందీగా సాగుతుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్.ఐ.ఆర్ లక్ష్యం

### - ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

**బెల్లంపల్లి, జూన్ 29, ప్రభాతవార్త**

ఎన్నికల జాబితాలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి తెలిపారు. సోమవారం బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 31వ, 33వ వార్డుల్లో జరుగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను ఎమ్మెల్యే స్వయంగా ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఏలు, బీఎల్వోలతో కలిసి ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు తప్పనిసరిగా ఓటరు జాబితాలో ఉండాలని, ఒక్క ఓటరు కూడా మిగిలిపోకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితా పూర్తిగా పారదర్శకంగా, తప్పులులేకుండా ఉండేందుకు ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని, అవసరమైన పత్రాలు సమర్పించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రతి బూత్‌లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి, పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలి

### - కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, జూన్ 29, ప్రభాతవార్త:**

భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వర్షాకాల ముందస్తు చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో ఎన్డీఆర్‌ఎఫ్, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, వైద్యారోగ్య, ఆర్ అండ్ బి శాఖల అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాల సమయంలో సమాచార మార్పిడి కీలకమని, ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాలు, చెరువుల కింద, లోతట్టు ప్రాంతాల ప్రజలకు వాతావరణ వివరాలు, నీటి మట్టం సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ప్రాజెక్టుల గేట్లు ఎత్తేముందు పరిసర ప్రాంతాల ప్రజలకు ముందుగా సమాచారం ఇవ్వాలని, ప్రాజెక్టుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. రోడ్లు దెబ్బతిన్న చోట, గుంతలు, ప్రమాదకర ప్రవాహాలు ఉన్నచోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రజలు ఆవైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారిని ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని, వరద ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని ఆదేశించారు. రోడ్లు కోతకు గురైతే, విద్యుత్ అంతరాయం కలిగితే తక్షణ పునరుద్ధరణకు సిద్ధంగా ఉండాలని, ముందస్తు రక్షణపై ఎన్డీఆర్‌ఎఫ్ బృందం విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. ప్రాజెక్టులు, ప్రమాదకర చెరువుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు ద్వారా రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. లోతట్టు ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా చూస్తామని, రెవెన్యూ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డిఎస్పీ శ్రీనివాస్, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

# భైంసాలో అత్యధికంగా 62.6 మి.మీ. వర్షపాతం నమోదు

**నిర్మల్, జూన్ 29, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లావ్యాప్తంగా సోమవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. జిల్లాలోని మొత్తం 19 మండలాల్లో కలిపి 378.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లా సగటు వర్షపాతం 19.9 మి.మీ.గా నమోదైంది. జిల్లాలోని భైంసా మండలంలో అత్యధికంగా 62.6 మి.మీ. వర్షం కురిసింది. అలాగే కుంటాల మండలంలో 42.8 మి.మీ., ఖానాపూర్‌లో 39.6 మి.మీ., దస్తురాబాద్‌లో 32.4 మి.మీ., లోకేశ్వరంలో 32.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. తానూర్ 30.2 మి.మీ., ముధోల్ 29.6 మి.మీ., మామడ 24.6 మి.మీ. వర్షపాతంతో ఈ మండలాలు తడిసిముద్దయ్యాయి. కాగా అత్యల్పంగా కుబీర్ మండలంలో 2.2 మి.మీ., పెంబిలో 2.4 మి.మీ. వర్షం కురిసింది. నిర్మల్ రూరల్ 3.2 మి.మీ., నిర్మల్ పట్టణంలో 3.8 మి.మీ., సారంగాపూర్ 6.2 మి.మీ., దిలావర్‌పూర్ మండలంలో 6.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. వీటితో పాటు బాసర 14.0 మి.మీ., నర్సాపూర్ (జి) 12.0 మి.మీ., సోన్ 12.4 మి.మీ., లక్ష్మణచాంద 11.4 మి.మీ., కడెం పెద్దూర్ మండలంలో 10.2 మి.మీ. వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఉదయం నుండి ఆకాశం పూర్తిగా మేఘావృతమై పలు మండలాల్లో మోస్తరు నుండి భారీ వర్షం కురవడంతో జిల్లావ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ వర్షాలతో రైతులు ఖరీఫ్ సాగు పనులకు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు. విత్తనాలు వేసేందుకు పొలాలను దున్నుతున్నారు. వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని వాగులు, వంకలు స్వల్పంగా ప్రవహిస్తున్నాయని స్థానికులు తెలిపారు. జిల్లాలో మరో రెండు రోజుల పాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే కఠిన చర్యలు

## - తహసిల్దార్ విజయకాంతరావు

**సారంగాపూర్, జూన్ 29, ప్రభాతవార్త:**


మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మొరం తవ్వకాలు జరిపి, నిల్వ చేసి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ విజయకాంతరావు హెచ్చరించారు. అక్రమ రవాణాపై మండల రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు, నియోజకవర్గ పోలీస్ సిబ్బంది నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి వచ్చే ఆదాయ వనరులకు ఎవరైనా గండి కొడితే సహించేది లేదన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అనుమతులు లేకుండా ఇసుక, మొరం తరలిస్తే అట్టి వాహనాలను తక్షణమే జప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అక్రమ తవ్వకాలపై కఠినంగా వ్యవహరిస్తామని, నిబంధనలు మీరిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

## - కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, జూన్ 29, ప్రభాతవార్త:**

ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును ఆయా శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తుల సమస్యలను ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సంబంధిత శాఖల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని ఆయన నొక్కి చెప్పారు. అర్హులైన బాధితులకు సకాలంలో న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, పింఛన్లు, భూ వివాదాలకు సంబంధించిన పలు దరఖాస్తులను జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



# నిర్దేశిత కార్యాచరణ ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టాలి

## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**నస్పూర్, జూన్ 29, ప్రభాతవార్త**

భారత ఎన్నికల సంఘం నిర్దేశిత కార్యాచరణ ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నిర్దేశిత కార్యచరణ ప్రకారం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, వివరాల నమోదు ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, పూరించిన తర్వాత సేకరించాలని, ఫారాల పంపిణీ ప్రక్రియను జూలై 1వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రతి రోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదై ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టరీత్యా శిక్షార్హమని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పేర్లు, ఇంటిపేర్లు, మహిళల వివాహానంతర ఇంటిపేరు మార్పులు వంటి వ్యత్యాసాలను పరిశీలించి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ బూత్ స్థాయి అధికారుల జాబితాలు, పోలింగ్ కేంద్రాల వివరాలు అందుబాటులో ఉంచాలని, రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లతో తరచూ సమావేశాలు నిర్వహించి ఓటరు జాబితాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రతి శనివారం జిల్లా స్థాయిలో, ప్రతి వారం నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు బి.ఎల్.ఓ. యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని, ఎం.ఎస్.ఎస్. వాలంటీర్లు, ఎం.సి.సి. క్యాడెట్లు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని వినియోగించుకోవాలని, గిరిజన, సరిహద్దు ప్రాంతాలలో స్థానిక భాష తెలిసిన హెల్పింగ్ హ్యాండ్స్‌ను నియమించాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించిన అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ పూర్తి అయిన స్టిక్కర్‌ను ప్రతి ఇంటికి అతికించాలని, ఫారాల పూరణ, సమర్పణపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.



జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రతి ఈ.ఆర్.ఓ., ఎ.ఈ.ఆర్.ఓ. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ పనులను పర్యవేక్షించి, ప్రతి ఎన్యూమరేషన్ ఫారంపై సంబంధిత ఓటరు సంతకం ఉండేలా బూత్ స్థాయి అధికారులు నిర్ధారించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విధుల సమయంలో ప్రతి బూత్ స్థాయి అధికారి తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించాలని, కొత్తగా నియమితులైన బూత్ స్థాయి అధికారులకు సంబంధిత ఈ.ఆర్.ఓ.లు వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 3 శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి బూత్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని, ఎన్యూమరేషన్ ఫారాలు, బి.ఎల్.ఓ. కిట్లు, ప్రచార సామగ్రి పంపిణీ పూర్తి చేయబడి, ఇంటింటి సర్వే కొనసాగుతోందని తెలిపారు. జిల్లాలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలి

## - తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**భైంసా, జూన్ 29, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చి, జూలై ఒకటో తారీఖు నుండి దేశవ్యాప్తంగా అమలు చేయనున్న వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్(గ్రామీణ్) చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. భైంసా పట్టణ పరిధిలోని వాలేగాం గ్రామంలో సోమవారం ఆ సంఘం గ్రామ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి నరసయ్య మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా ఎంతోమంది గ్రామీణ నిరుపేదలకు జీవనోపాధిని కల్పించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఉపాధి హామీ పథకం) యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాత చట్టాన్ని రద్దు చేసి కొత్త నిబంధనలతో తెస్తున్న ఈ చట్టం వల్ల గ్రామీణ కార్మికుల హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. నూతన చట్టానికి వ్యతిరేకంగా జూలై 1వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను, మండల కేంద్రాల్లోని పంచాయతీ కార్యాలయాల ముందర చేపట్టే ఆందోళనలను గ్రామీణ కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రతి ఓటరు, కూలీ తమ హక్కుల పట్ల చైతన్యవంతంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిమ్మాపురం ముత్తన్న, సంఘం నాయకులు బి. ప్రసాద్, వాలేగాం గ్రామ కమిటీ అధ్యక్షురాలు కూతాడి విజయ, ఉపాధి హామీ కూలీలు, గ్రామ కార్మికులు పాల్గొన్నారు.

# భార్య జ్ఞాపకార్థం బసవేశ్వర ఆలయానికి సామాగ్రి విరాళం

**సారంగాపూర్, జూన్ 29, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని యాకర్ పల్లి గ్రామంలోని బసవేశ్వర ఆలయానికి మేకల లావణ్య వర్ధంతి సందర్భంగా ఆమె భర్త మేకల చంద్రశేఖర్ సోమవారం స్టీలు పల్లాలు, గ్లాసులు, టేబుళ్లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది మాట్లాడుతూ.. చంద్రశేఖర్ అందజేసిన ఈ సామాగ్రిని ప్రతి సోమవారం ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భక్తుల సౌకర్యార్థం వినియోగిస్తామని తెలిపారు. ఈ స్టీలు సామాగ్రి వినియోగం వల్ల ఆలయ పరిసరాలలో ప్లాస్టిక్ రహిత వాతావరణం ఏర్పడుతుందని పేర్కొంటూ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ అభినందించింది. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కంటోల్లో శ్రీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు రాజేశ్వర్ రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మేకల నవీన్ యాదవ్, కండెల మహేందర్, చిట్యాల సాయందర్, ఆలయ అర్చకులు అభిషేక్ శర్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



స్టీలు సామాగ్రిని అందజేస్తున్న మేకల చంద్రశేఖర్

# షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూన్ 29, ప్రభాతవార్త**

జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఎ.సి.పి.లు ప్రకాష్, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, షెడ్యూల్డ్ కులములు అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్‌లతో కలిసి పోలీస్, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు, ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో అట్రాసిటీ కేసులు, పరిష్కారం, బాధితులకు న్యాయం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న ఎస్.సి., ఎస్.టి. సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి.ల అభివృద్ధి, కేసులు, ఎన్ ఫోర్స్ మెంట్ అమలు అంశాలపై తీసుకుంటున్న చర్యలపై సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎస్.సి., ఎస్.టి.లకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఇండ్లు నిర్మించుకోలేని వారికి గుత్తేదారుల సమన్వయంతో ఇల్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాలు, ఆసుపత్రులు తదితర సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రగతికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, గురుకులాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, విద్యార్థుల హాజరు శాతం పెంపొందించాలని, విద్యార్థులకు క్రమశిక్షణ అలవాటు చేయాలని తెలిపారు. పోలీసు శాఖ పరిధిలోని అట్రాసిటీ కేసులు కార్యచరణ ప్రకారంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అట్రాసిటీ కేసులలో తప్పుడు కేసులు నమోదు చేసిన వాటి వివరాలను స్పష్టంగా రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ కేసులలో ఫిర్యాదుదారులు చేసిన ఫిర్యాదులో వివరాలు సక్రమంగా ఉన్నట్లయితే సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. అధికారుల చొరవతో ప్రతి నెల పౌర హక్కుల దినోత్సవం నిర్వహణ ద్వారా కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టిందని, పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి, నిషేధిత మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక నిఘా చేపట్టాలని, జిల్లాలో క్రయ విక్రయాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో బెల్ట్ షాపులు అధికమవడంతో యువత పక్కదారి పడుతుందని, నియంత్రించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారిశుధ్యం, త్రాగునీరు ఇతర ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల సంబంధిత జనాభా అధికంగా ఉన్న జిల్లాలోని 7 గ్రామాలకు అదనంగా 20 లక్షల రూపాయల చొప్పున గ్రామపంచాయతీ నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. విజిలెన్స్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించడం జరుగుతుందని, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు మాదకద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను వివరించాలని, సంక్షేమ వసతి గృహాలలో ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు.



డి.సి.పి. మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల నియంత్రణపై ఎస్.సి., ఎస్.టి. లకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను గ్రామపంచాయతీలలో నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరికి హక్కులపై అవగాహన కలుగుతుందని తెలిపారు. కేసుల పరిష్కారంలో సాంకేతికతను ఉపయోగిస్తున్నామని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. సరైన ఆధారాలు సేకరించడం జరుగుతుందని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాల నిరోధంపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, అనుమానం ఉన్న వ్యక్తులను గుర్తించి రిహాబిటేషన్ సెంటర్ కు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆబ్కారీ మద్య నిషేధ శాఖ సమన్వయంతో బెల్ట్ షాపుల నియంత్రణపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఈ కార్యక్రమంలో ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు, దుర్గం ఎల్లయ్య, పెద్ది రాజన్న, జిల్లా పౌర సంబంధాల అధికారి యం.కృష్ణమూర్తి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, గిరిజన అభివృద్ధి, టి.జి.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఈ.ఐ.ఎస్. శాఖల అధికారులు, కలెక్టరేట్ బి విభాగం పర్యవేక్షకులు మధుసూదన్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగి రక్షణతోనే విధులు నిర్వహించాలి

### - శ్రీరాంపూర్ డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్

### - మృతి చెందిన ఆర్.కె 7 గని ఫిట్టర్ వెంకటేష్ కుటుంబానికి రూ. 20.34 లక్షల ఆర్థిక సాయం అందజేత

**నస్పూర్, జూన్ 29, ప్రభాతవార్త**



సింగరేణి ఉద్యోగం అంటేనే నిత్యం ప్రమాదంతో కూడుకున్నదని, ప్రతి ఒక్క ఉద్యోగి రక్షణతోనే తమ విధులు నిర్వహించాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె 7 గనిలో ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తూ కొద్దిరోజుల క్రితం డ్యూటీలో స్పృహతప్పి రేల్స్‌పై పడి గాయపడి, ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సూదమల్ల వెంకటేష్ కుటుంబానికి సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మరణాన్ని కంపెనీ ఫాటల్ మరణంగా పరిగణించడంతో యాజమాన్యం తరఫున మ్యాచింగ్ గ్రాంట్ కింద 10 లక్షల రూపాయల చెక్కును, ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల జీతం నుంచి సేకరించిన 10 లక్షల 34 వేల 208 రూపాయల మొత్తాన్ని కలిపి మొత్తం రూ. 20.34 లక్షల చెక్కులను వెంకటేష్ భార్య స్రవంతికి అందజేశారు. గని మేనేజర్ తిరుపతి, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం ఎస్. అనిల్ కుమార్ చేతుల మీదుగా ఈ చెక్కుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎంత నష్టపరిహారం చెల్లించినా పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేమని, సంస్థ సంక్షేమంలోనే కాకుండా ఇలాంటి ప్రమాదాల సమయంలోనూ బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. మృతుడి భార్యకు డిపెండెంట్ ఉద్యోగం కల్పించడంతో పాటు ఇంత పెద్ద మొత్తంలో నష్టపరిహారం అందించడం ఒక్క సింగరేణి సంస్థలోనే సాధ్యమన్నారు. తదుపరి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి నిర్లక్ష్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని కోరారు. కార్మికుల భద్రతే మొదటి ప్రాధాన్యత కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి సంతోష్ కుమార్, సంక్షేమ అధికారి సంతన్, పిట్ సెక్రటరీ మారేపల్లి సారయ్య, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# అవినీతి మయంగా మారిన మంచిర్యాల నగర పాలకవర్గం

### - ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారు
### - బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్
### - కౌన్సిల్ భవనం ఎదుట భారతీయ జనతా పార్టీ ధర్నా

**మంచిర్యాల, జూన్ 29, ప్రభాతవార్త**

మంచిర్యాల పట్టణ పాలకవర్గంలో నెలకొన్న అవినీతి, ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష స్వరాలను అణచివేస్తున్నారని భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ తీవ్రంగా ఆరోపించారు. సోమవారం రోజు నిర్వహించిన మంచిర్యాల నగర పాలకవర్గ సమావేశంలో భారతీయ జనతా పార్టీ మున్సిపల్ ఫ్లోర్ నాయకుడు గాజుల ముఖేష్ గౌడ్ కార్పొరేషన్‌లో నెలకొన్న సమస్యలపై గళం విప్పగా, ఆయనను సభ నుండి సస్పెండ్ చేయాలని మేయర్ ఆదేశించడం నిరంకుశ పాలనకు నిదర్శనమని అన్నారు. ఈ చర్యకు నిరసనగా నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు మంచిర్యాల మున్సిపల్ కౌన్సిల్ భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ గౌడ్, ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి, ప్రజా సమస్యలపై మాట్లాడితే అధికార పక్ష కార్పొరేటర్లు అడ్డుపడి ప్రతిపక్ష గొంతులను అణచివేస్తున్నారని విమర్శించారు. పట్టణంలోని ప్రతి విభాగంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు ముఖేష్ గౌడ్‌ను సస్పెండ్ చేయడం అమానుష చర్య అని వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. నగర అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ నిధులు, ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదని ఆరోపించారు. మహా ప్రస్థానం నిర్మాణానికి నాలుగు కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అమృత్ 2.0 పథకం కింద నిధులు ఇచ్చిందని, చెరువుల పునరుద్ధరణకు కూడా కోట్ల రూపాయలు కేటాయించిందని పేర్కొన్నారు. సోమవారం రోజు భారతీయ జనతా పార్టీ తరఫున కమిషనర్‌కు వినతిపత్రం అందజేయడానికి ప్రయత్నించినా, కనీసం దానిని స్వీకరించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. మంచిర్యాల నగర పాలకవర్గంలో జరుగుతున్న అవినీతిపై తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కస్తూరి నాగరాజు, బోట్ల అనిత, పెద్దపల్లి పురుషోత్తం, కృష్ణమూర్తి, పట్టి వెంకటకృష్ణ, బియ్యాల సతీష్‌రావు, మొటపలుకుల తిరుపతి, ఆకుల అశోక్ వర్ధన్, జోగుల శ్రీదేవి, జయరామరావు, సత్రం రమేష్, అమిరిశెట్టి రాజ్‌కుమార్, వైద్య శ్రీధర్, కొయ్యడ పద్మ, పచ్చ స్వప్నరాణి తదితరులు పాల్గొన్నారు.

# తేజాపూర్‌లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

### పరిశీలించిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి

**నేరడిగొండ, జూన్ 29, ప్రభాతవార్త:**



నేరడిగొండ మండలం తేజాపూర్ గ్రామంలోని 268వ పోలింగ్ బూత్‌లో నాలుగో రోజు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి సోమవారం సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా బద్దం పోత రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఓటరు తమ ఓటు యొక్క ప్రాధాన్యతను తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. పొరపాటున ఓటును కోల్పోతే రేషన్ కార్డు, పింఛన్ మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంటుందని ఓటర్లను చైతన్యపరిచారు. ఈ ప్రక్రియలో భాగంగా ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) ప్రతి ఇంటికి మూడు సార్లు వస్తారని, కావున ఓటర్లందరూ తమ కచ్చితమైన వివరాలను బీఎల్ఓలకు అందిస్తూ వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ కమలాకర్ రెడ్డి, బూత్ స్థాయి ఏజెంట్ గజ్జెల అశోక్, తేజాపూర్ కాలనీ వార్డు మెంబర్ భీమ్రావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ఓటర్లు పాల్గొన్నారు.

### జనరిక్ మందులపై అపోహలు వద్దు

# అవగాహనే ఆరోగ్యానికి ఆయుధం

**- సుదమల్ల చిలుకన్నా, ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు**

**మంచిర్యాల, జూన్ 29, ప్రభాతవార్త**

మన దేశంలో ప్రతి సంవత్సరం వైద్య చికిత్సలపై కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ప్రతినెలా మందుల కోసం అధిక మొత్తంలో డబ్బు వెచ్చించాల్సి వస్తోంది. అయితే, ఇదే చికిత్సను చాలా తక్కువ ఖర్చుతో పొందే అవకాశం ఉన్నప్పటికీ, చాలామంది ప్రజలు జనరిక్ మందులపై ఉన్న అపోహల కారణంగా వాటిని వినియోగించడానికి వెనుకంజ వేస్తున్నారు అని అన్నారు.

## జనరిక్ మందులు అంటే ఏమిటి?

ఒక ఔషధాన్ని మొదటిసారి కనుగొన్న ఔషధ కంపెనీ దానికి పేటెంట్ హక్కులు పొందుతుంది. ఆ కాలం పూర్తయ్యాక, అదే ఔషధంలోని అదే యాక్టివ్ ఇంగ్రిడియెంట్, అదే మోతాదు, అదే నాణ్యత, అదే ప్రభావం కలిగిన మందులను ఇతర కంపెనీలు కూడా తయారు చేయవచ్చు. వీటినే జనరిక్ మందులు అంటారు. అంటే, రోగాన్ని తగ్గించే అసలు ఔషధ పదార్థం ఒకటే. మారేది కేవలం కంపెనీ పేరు, ప్యాకింగ్, బ్రాండ్ పేరు మాత్రమే అని, చాలామంది ౹౹బ్రాండెడ్ మందులే మంచి ఫలితాలు ఇస్తాయి, జనరిక్ మందులు బలహీనంగా ఉంటాయి౹౹ అని భావిస్తారు. కానీ ఇది నిజం కాదు. బ్రాండెడ్ మందు అయినా, జనరిక్ మందు అయినా రెండింటిలోనూ ఉండే ప్రధాన ఔషధ పదార్థం ఒకటే. అందువల్ల వైద్యపరంగా రెండూ సమానంగా పనిచేస్తాయి.



ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలను పాటించిన తర్వాతే మార్కెట్లోకి విడుదల అవుతాయి అని చెప్పారు, చాలామందికి వచ్చే ప్రధాన సందేహం ౹౹మంచి మందు అయితే ఇంత తక్కువ ధర ఎలా ఉంటుంది?౹౹ దీనికి కారణాలు భారీ ప్రకటనల ఖర్చు ఉండదు, డాక్టర్లకు మార్కెటింగ్ ఖర్చులు ఉండవు, ఆకర్షణీయమైన ప్యాకింగ్‌పై అధిక వ్యయం చేయరు, కొత్తగా ఔషధాన్ని కనిపెట్టడానికి అయ్యే పరిశోధన ఖర్చు ఉండదు మరియు బ్రాండ్ విలువ కోసం అదనపు ధర వసూలు చేయరు. అందువల్ల అదే మందు 70,80 శాతం వరకు తక్కువ ధరలో లభిస్తుందని నాణ్యతపై భయపడాల్సిన అవసరమూ లేదని చెప్పారు.

భారతదేశంలో మందుల తయారీ, నాణ్యత నియంత్రణను సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ మరియు రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ శాఖలు పర్యవేక్షిస్తాయి. జనరిక్ మందులు కూడా ఈ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి. నాణ్యత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తర్వాతే విక్రయానికి అనుమతి లభిస్తుంది. సామాన్య ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన మందులు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో వేల రకాల జనరిక్ మందులు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలు తమ వైద్య ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవాలనీ, వైద్యుడి సలహా లేకుండా స్వయంగా బ్రాండెడ్ మందును జనరిక్ మందుతో మార్చకూడదు. ప్రతి మందుకు సరైన ప్రత్యామ్నాయం గురించి వైద్యుడు లేదా ఫార్మసిస్ట్‌ను సంప్రదించాలి విశ్వసనీయమైన ఫార్మసీ లేదా జన ఔషధి కేంద్రం నుంచే మందులు కొనాలి. మందులను వైద్యుడు సూచించిన విధంగానే వాడాలి. జనరిక్ మందుల వినియోగం పెరిగితే కుటుంబాల వైద్య ఖర్చులు తగ్గుతాయి. పేదలకు కూడా నాణ్యమైన చికిత్స అందుబాటులోకి వస్తుంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఆర్థిక భారం తగ్గుతుంది. దేశ ఆరోగ్య వ్యవస్థపై ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. జనరిక్ మందులు నాణ్యతలోనూ, ప్రభావంలోనూ బ్రాండెడ్ మందులకు ఏమాత్రం తీసిపోవు. తక్కువ ధర కారణంగా వాటిని తక్కువగా అంచనా వేయడం సరైంది కాదు. ప్రజలు అపోహలను విడనాడి, వైద్యుల సలహా మేరకు జనరిక్ మందులను వినియోగిస్తే తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా, వైద్య ఖర్చులను కూడా గణనీయంగా తగ్గించుకోవచ్చు. ఖరీదైన మందే మంచి మందు కాదు. సరైన నాణ్యతతో, సరైన చికిత్సను అందించే జనరిక్ మందే సామాన్యుడికి నిజమైన ఆరోగ్య రక్షణ అని జిల్లా ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలుకన్న తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో వటసావిత్రి వ్రత పూజలు

**జైనూర్, జూన్ 29, ప్రభాతవార్త**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని హనుమాన్ మందిర్ ఆవరణలో సోమవారం ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని వటసావిత్రి వ్రత పూజలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని మర్రి చెట్టు కింద హనుమాన్ మందిర్ పూజారి కులకర్ణి పండిత్ మహారాజ్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక వ్రత పూజా కార్యక్రమాలు సాగాయి. ఈ సందర్భంగా పూజారి కులకర్ణి పండిత్ మహారాజ్ వటసావిత్రి వ్రత కథను చదువుతూ మహిళలతో శాస్త్రోక్తంగా పూజలు చేయించారు. సుమంగళిగా వర్ధిల్లాలని, తమ భర్తలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా మర్రిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ దారాన్ని చుట్టారు. మంగళహారతులు పాడుతూ వటవృక్షానికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# చిన్నపాటి నిర్లక్ష్యంతో రక్షణ సూత్రాలు విస్మరిస్తే భారీ ప్రమాదాలు

**- డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) కోమల్ చౌదరి**

**- శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో విద్యుత్ ప్రమాదాల నియంత్రణపై అవగాహన సదస్సు**

**నస్పూర్, జూన్ 29, ప్రభాతవార్త**



భూగర్భ గనులు, ఉపరితల గనుల్లో చిన్నపాటి నిర్లక్ష్యంతో రక్షణ సూత్రాలు విస్మరిస్తే భారీ విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) కోమల్ చౌదరి హెచ్చరించారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌తో కలిసి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యుత్ ప్రమాదాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏరియా ఈ అండ్ ఎమ్ అధికారులు, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్లు, సూపర్‌వైజర్లకు గనుల్లో విద్యుత్ పరికరాలు, యంత్రాల వినియోగం పట్ల చోటుచేసుకుంటున్న భద్రతా ఉల్లంఘనలపై ఆయన ప్రధానంగా వివరించారు. వివిధ గనుల్లో జరుగుతున్న నిరక్ష్యాల్లను ఫోటోలు, వీడియోల ఆధారంగా ఉదహరిస్తూ రాబోయే వర్షాకాలంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాలని, లోటో విధానాన్ని కచ్చితంగా పాటించాలని సూచించారు. డీడీఎంఎస్ వివరణ అనంతరం అధికారులు, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏరియా వ్యాప్తంగా ఏ చిన్న ఎలక్ట్రికల్ ప్రమాదానికి ఆస్కారం లేకుండా అందరూ తమ పరిధిలో సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా డీడీఎంఎస్ కోమల్ చౌదరి ఉదహరించిన భద్రతా లోపాలు ఏవైనా తమ ఏరియాలో ఉన్నాయా అనేది తక్షణమే సమీక్షించుకొని వాటిని సరిచేసుకోవాలని స్పష్టం చేశారు. భద్రతా ప్రమాణాల విషయంలో ఎవరూ రాజీ పడకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రమణారావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ విజయ్ కుమార్, ప్రాజెక్ట్ ఇంజనీర్లు, గ్రూప్ ఇంజనీర్లు, పిట్ ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు

# అనుమతులు లేని జ్ఞాన వికాస్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

**- తెలంగాణ విద్యార్థి పరిషత్ డిమాండ్**

**నేరడిగొండ, జూన్ 29, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండల కేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా కొనసాగుతున్న జ్ఞాన వికాస్ పాఠశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నేరడిగొండ మండల విద్యాశాఖ అధికారి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సతీష్‌కు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి పరిషత్ నాయకులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జ్ఞాన వికాస్ పాఠశాల కనీస అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అడ్మిషన్లు జరుపుతోందని మండిపడ్డారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ పాఠశాల వల్ల విద్యార్థుల భద్రతకు తీవ్ర ముప్పు పొంచి ఉందన్నారు. ఈ పాఠశాల నిర్వాహకులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతానికి చెందిన వారు కాదని తెలిపారు. గతంలో ఇదే నిర్వాహకులు ఖిలిటిల్ హార్ట్స్ఖి అనే పాఠశాలను కూడా ఇదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారని, ఆ సమయంలో విద్యార్థుల టీసీలు, బోనఫైడ్‌ల విషయంలో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అనుమతులు లేని ఇలాంటి పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని, జ్ఞాన వికాస్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే, విద్యార్థులు, తల్లిదండ్రులను ఒకతాటిపైకి తెచ్చి త్వరలోనే విద్యాశాఖ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి పరిషత్ మండల నాయకులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహకారంతో దర్బాతాండలో తీరిన నీటి కష్టాలు

**- కృతజ్ఞతగా చిత్రపటానికి పాలాభిషేకం**

**నేరడిగొండ, జూన్ 29, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలంలోని దర్బాతాండ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని గ్రామస్థులు బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తక్షణమే స్పందించారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో గ్రామంలో కొత్తగా బోరుబావి వేయించి, నీటి సరఫరాను పునరుద్ధరించడంతో గ్రామస్థుల నీటి కష్టాలు తీరాయి. తమ సమస్యపై సానుకూలంగా స్పందించి తాగునీటి ఇబ్బందులను దూరం చేసినందుకు కృతజ్ఞతగా సోమవారం దర్బాతాండ గ్రామస్థులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమను ఎమ్మెల్యే ఆదుకున్నారని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దర్బాతాండ గ్రామస్థులు

## ఉద్యోగ భద్రత కల్పించాలి... కుటుంబ సభ్యులకు ఉపాధి కొనసాగించాలి

**- సీటీయూ నాయకుల డిమాండ్**

**మందమర్రి, జూన్ 29, ప్రభాతవార్త**

ప్రభుత్వాలు మారుతున్నా మున్సిపల్ కార్మికుల జీవితాల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదని, వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీటీయూ నాయకులు విమర్శించారు. సోమవారం మందమర్రిలో మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం చెన్న రాజం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీటీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంకె రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ, సంవత్సరాల తరబడి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు ఇప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం ఆందోళనకరమన్నారు. గతంలో అమల్లో ఉన్న విధానాన్ని పునరుద్ధరించి, విధుల్లో ఉన్న కార్మికులు పదవీ విరమణ చేసినా లేదా మరణించినా వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించే విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే భారత రాజ్యాంగం కార్మికులకు కల్పించిన హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కార్మికులకు అనేక హామీలు ఇచ్చినా, మూడేళ్లు గడిచినా వాటి అమలులో పురోగతి కనిపించడం లేదని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాలకు సిద్ధం కావాలని సమావేశంలో కార్మికులకు పిలుపునిచ్చారు.

### నూతన కమిటీ ఎన్నిక..

అనంతరం మందమర్రి మున్సిపల్ కార్మికుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు గా సంకె రవి, అధ్యక్షుడు గా చెన్న రాజం, ప్రధాన కార్యదర్శి మేడపట్ల నర్సయ్య, ఉపాధ్యక్షులు ఎల్కటూరి భూమయ్య, దాసరి శంకరమ్మ, సహాయ కార్యదర్శులు సంగి పోశం, దుర్గం శంకర్, కమిటీ సభ్యులు 10 మంది ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సీటీయూ జిల్లా నాయకుడు కోలా వాసు, మారుపాక పోషు, గోడిసేల స్వరూప, అమ్మాయి, ఎంకమ్మ, పోశం తదితరులు పాల్గొన్నారు.

## ఐక్య పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన సాధ్యం

**- జాతీయ కార్మిక సంఘాల జేఏసీ - జూలై 1న బొగ్గు గనుల వ్యాప్తంగా నిరసనలను విజయవంతం చేయాలని పిలుపు**

**- లేబర్ కోడ్‌ల ఉపసంహరణ, 12వ వేతన ఒప్పందం అమలుకై డిమాండ్**

**నస్పూర్, జూన్ 29, ప్రభాతవార్త**

కార్మికుల అపరిష్కృత సమస్యల పరిష్కారం, హక్కుల సాధనే కార్మిక సంఘాల ప్రధాన ధ్యేయమని జాతీయ కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) నాయకులు స్పష్టం చేశారు. సోమవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్ జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, జెట్టి శంకర్ రావు, తుమ్మల రాజా రెడ్డి, వి. అనిల్ రెడ్డి మాట్లాడుతూ, 12వ వేజ్ బోర్డు అమలులో ఆలస్యాన్ని నిరసిస్తూ జూలై 1వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను సింగరేణి కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. పే కమిషన్ ద్వారా నామమాత్రపు వేతనాలు మాత్రమే వస్తాయని, వేజ్ బోర్డు ద్వారానే మెరుగైన వేతనాలు సాధ్యమని పేర్కొన్నారు. అవసరమైతే నిరవధిక సమ్మెకు కూడా తాము సిద్ధమని ప్రకటించారు. సింగరేణిలో బొగ్గు మాయం అవడం అనేది జరగదని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించలేనప్పుడు కొంత మేర బుక్ అడ్జస్ట్‌మెంట్ చేయడం గతంలో కూడా ఉందని వెల్లడించారు. లేని ఉత్పత్తి, లాభాలను చూపిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెండ్ కట్టాల్సిన అవసరం ఏముందని అధికారులను ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే కొంతమంది సింగరేణిపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను కార్మికలోకం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని నాయకులు తేల్చిచెప్పారు. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న ఉద్యోగ భద్రత, వేతన హక్కు, ఎనిమిది గంటల పని విధానం, ట్రేడ్ యూనియన్ హక్కులను కాలరాసే ప్రతి ప్రయత్నాన్ని ఐక్య ఉద్యమాలతో తిప్పికొడతామని హెచ్చరించారు. ఈ లేబర్ కోడ్‌లు అమలులోకి వస్తే శాశ్వత ఉద్యోగాలు కనుమరుగై, కాంట్రాక్టు విధానం విస్తరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ నల్ల చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

### జూలై 1న కొత్తగూడెంలో భారీ నిరసన

కోల్ ఇండియా, సింగరేణి కార్మికులకు అత్యంత కీలకమైన జేబీసీసీఐ 12వ వేతన ఒప్పందం ప్రక్రియను లేబర్ కోడ్‌ల పేరుతో ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడం తీవ్ర అన్యాయమన్నారు. వెంటనే వేతన ఒప్పంద చర్చలు ప్రారంభించి, ఖాళీ పోస్టుల భర్తీ, గనుల్లో భద్రతా ప్రమాణాల మెరుగుదల, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. జూలై 1న కొత్తగూడెం ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించే భారీ సంయుక్త నిరసన కార్యక్రమానికి సింగరేణి అన్ని ఏరియాల కార్మికులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన సిబ్బంది పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ3 గని వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికుల హక్కులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు కె. వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, షేక్ బాజీ సైదా, ఐఎన్‌టీయూసీ నాయకులు గరిగె స్వామి, ల్యాగల శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు కస్తూరి చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్, హెచ్ఎంఎస్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కొమరయ్య, సురేష్ పాల్గొన్నారు.

## సింగరేణి అభివృద్ధిలో కార్మికులే కీలకం

**- సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ**

**మందమర్రి, జూన్ 29, ప్రభాతవార్త**

సింగరేణి కార్మికుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా, వారి సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసితో 19వ స్ట్రక్చర్ మీటింగ్ సౌహార్ద వాతావరణంలో నిర్వహించారు. సోమవారం మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటియుసి మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, రామకృష్ణపూర్ సెక్రటరీ అక్బర్ అలీతో పాటు ఇతర నాయకులు పాల్గొని కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఓటు జీఎం జి.ఎల్. ప్రసాద్, కేకేఓసీ ప్రాజెక్ట్ అధికారి రాంబాబు, ఎస్కే గ్రూప్ ఏజెంట్ సంతోష్ కుమార్, డీజీఎం (పర్సనల్) అశోక్, డీజీఎం (ఐఈడీ) కిరణ్ కుమార్, డీజీఎం (ఈ అండ్ ఎం) సురేష్, డీజీఎం (సివిల్) షేక్ మదీనా భాష, డి.వై.పి.ఎం విజయ్ సందీప్, సీనియర్ పి.ఓ కార్తీక్, యూనియన్ తరఫున ఏఐటీయూసీ సీనియర్ నాయకులు కంది శ్రీనివాస్, స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సి.వి. రమణతో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## 25వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

**నస్పూర్, జూన్ 29, ప్రభాతవార్త**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులు దుర్గం రాంబాయి-మల్లయ్య దంపతులు నిర్మించుకున్న నూతన గృహాన్ని మేయర్ ధర్ని మధుకర్ సోమవారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సహకారంతో పూర్తయిన ఈ ఇంటి గృహ ప్రవేశ మహోత్సవానికి మేయర్‌తో పాటు స్థానిక కార్పొరేటర్ తోట రజిత శ్రీనివాస్ హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్, కార్పొరేటర్లను లబ్ధిదారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం పునఃప్రారంభం

**- అవసరమైన వారికి బెల్లంపల్లి లయన్స్ ఐ హాస్పిటల్‌లో ఉచిత శస్త్రచికిత్సలు: డా. కొత్తపల్లి శ్రీనివాస్**

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 29, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో మంగళవారం (జూన్ 30) నుంచి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఐ క్యాంప్ కోఆర్డినేషన్ చైర్మన్ డా. కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరంలో ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షల అనంతరం కంటి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించిన వారికి బెల్లంపల్లి లయన్స్ ఐ హాస్పిటల్‌లో పూర్తిగా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రోగులకు ఉచిత రవాణా, భోజన సౌకర్యాలు కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డా. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 9 వేలకుపైగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. లయన్స్ క్లబ్ కాగజ్‌నగర్ కొత్తపేట, శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డా. శ్రీనివాస్ కోరారు.

## లయన్స్ క్లబ్ కొత్తపేట అధ్యక్షురాలిగా డా. కొత్తపల్లి అనిత బాధ్యతల స్వీకారం

**- 18 ఏళ్లుగా నిరంతర సేవలు..**

**- మరిన్ని ప్రజా సేవా కార్యక్రమాలు చేపడతాం: డా.అనిత**

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 29, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ కొత్తపేట లయన్స్ క్లబ్-320జి నూతన అధ్యక్షురాలిగా లయన్ డా. కొత్తపల్లి అనిత (ఎంజెఎఫ్) బాధ్యతలు స్వీకరించారు. క్లబ్ 18వ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం జూన్ 28న సాయంత్రం 6 గంటలకు వైభవంగా నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా లయన్ సాయి కిరణ్ గౌడ్, కోశాధికారిగా లయన్ రతన్ గైన్ ప్రమాణ స్వీకారం చేశారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ నారాయణ రెడ్డి (ఎంజెఎఫ్), కార్యక్రమ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి శ్రీనివాస్, రీజియన్ చైర్మన్ లయన్ బాపు రెడ్డి, జోనల్ చైర్మన్ లయన్ పోతురాజుల లక్ష్మీ్మణ్ సమక్షంలో నూతన కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు డా. కొత్తపల్లి అనిత మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత 18 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మనవరాలు సర్వీస్ సొసైటీ సహకారంతో బెల్లంపల్లి ఐ హాస్పిటల్‌లో ఇప్పటివరకు 10 వేలకుపైగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వెల్లడించారు. అలాగే ఉచిత అంబులెన్స్, ఉచిత ఫ్రీజర్ బాక్స్ సేవలతో పాటు భవిష్యత్తులో మరిన్ని ప్రజా సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్ పెద్దపల్లి కిషన్‌రావు, లయన్ సునీల్ రెడ్డి, లయన్ చిలువేరు సుధాకర్, లయన్ అరుణ్ కుమార్ లోయ (ఎంజెఎఫ్), లయన్ పాలెపు నగేష్, లయన్ డా. తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

